సాక్షి
నారాయణపేట
బుధవారం । 8 । నవంబర్ । 2023



మక్తల్.. స్థానికులకు దూరం

మక్తల్ ఏర్పడినప్పటి నుంచి స్థానికేతరులే ఎమ్మెల్యేగా గెలుపొందుతున్నారు.

వివరాలు IIలో ▸



అద్దె భవనాలే దిక్కు..

కొత్త మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

వివరాలు IIIలో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /19.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం చల్లని గాలులు వీస్తాయి. రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటు వజ్రాయుధం

- అదనపు ఎస్పీ నాగేంద్రుడు



కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది.. ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ నాగేంద్రుడు సూచించారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన హన్మాన్‌పల్లి, మీర్జాపూర్‌లోని వీధుల్లో స్థానిక పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో మనోధైర్యం నింపడంతో పాటు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసుశాఖ ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హోం మంత్రి రాక..

నారాయణపేట: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు జిల్లాకేంద్రంలో జరిగే మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ హాజరవుతారని జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎంఏ వహిద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఆర్ గార్డెన్ (పాత పోలేపల్లి ఫంక్షన్ హాల్)లో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి నియోజకవర్గంలోని మైనార్టీ సోదరులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్, రాంకిష్టాయిపల్లి, కొండాపూర్ పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించడంతో పాటు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఆశించిన స్థాయిలో ఫలితం రాకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు.

ఆడపిల్లల ప్రాధాన్యతపై అవగాహన



నారాయణపేట రూరల్ : ఆడపిల్లల ప్రాముఖ్యతపై మహిళా శిశుసంక్షేమ శాఖ మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కోటకొండలో అవగాహన నిర్వహించారు. ఆడపిల్ల భారంగా భావించొద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మాయిల ఎదుగుదలకు ఎన్నో పథకాలు, సౌకర్యాలు కల్పిస్తున్నాయని వివరించారు. వంటింటికి పరిమితం కాకుండా విమానాలు నడిపించే స్థాయికి ఎదిగారని, ప్రతీచోట రిజర్వేషన్లు అమలు ఉన్నాయని చెప్పారు. కుటుంబంలో అమ్మాయిలు ఉంటేనే అందమన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నర్సింహారావు, కౌన్సిలర్ స్వప్న, అశోక్‌రాజ్, ప్రభావతమ్మ, మహిళా సభ్యులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మక్తల్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. వేదికపై అభ్యర్థి వాకిటి శ్రీహరి, ఒబేదుల్లా కొత్వాల్, మల్లు రవి, సతా దయాకర్‌రెడ్డి తదితరులు

14 సీట్లు గెలవకపోతే.. ఎక్కిరిస్తరు..

దొరల పాలన కావాలా.. ప్రజల తెలంగాణ కావాలో తేల్చుకోండి

- మక్తల్, ఆత్మకూర్‌లను రెవెన్యూ డివిజన్లు చేస్తాం
- వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చే బాధ్యత నాది
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- అలంపూర్, గద్వాల, మక్తల్‌లో 'ప్రజాగర్జన' సభలు విజయవంతం

నారాయణపేట/ మక్తల్/ అలంపూర్/ గద్వాల రూరల్/గద్వాల అర్బన్/ గద్వాల: 'కొడంగల్ నియోజకవర్గం నారాయణపేట జిల్లాలో ఉంది.. ఈ ప్రాంత బిడ్డనైన నేను టీపీసీసీ అధ్యక్షుడినయ్యా.. పాలమూరులో 14 సీట్లు గెలవకపోతే ఎక్కిరిస్తరు.. ఈ గడ్డ మీద గ్రూపులు లేవు.. ముఠా తగాదాలు లేవు.. మనమందరం ఏకం కావాలి.. పాలమూరు 14 సీట్లు గెలవాలి.. వలసలు ఆగుతాయ్.. బీడు భూములు పండుతాయ్.. నారాయణపేట, కొడంగల్ పథకం తెస్తే పడావు పెట్టిండు.. ఆ పథకం రావాలంటే 14 సీట్లు గెలవాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గం శాంతినగర్, గద్వాల, మక్తల్‌లో నిర్వహించిన 'పాలమూరు ప్రజా గర్జన' బహిరంగ సభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన అలంపూర్ క్షేత్రాన్ని అలంపూర్ అసెంబ్లీ అభ్యర్థి సంపత్‌కుమార్‌తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే షా–అలీ పహిల్వాన్ దర్గాలో ప్రార్థనలు జరిపారు. అనంతరం వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో ప్రచార రథంలో రోడ్‌షో నిర్వహించారు. ఆయా సందర్భాల్లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పదేళ్ల పాలనలో డబుల్ బెడ్రూం, మూడెకరాల భూమి, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో దొరల పాలన కావాలో.. ప్రజల తెలంగాణ కావాలో నిర్ణయించుకోవాలని సూచించారు.

అలంపూర్‌ను ఎడారిగా మార్చారు..

పదేళ్ల పాలనలో అలంపూర్‌ను ఎడారిగా మార్చిన బీఆర్‌ఎస్‌ను బొందపెట్టాలనే పట్టుదల ఇక్కడున్న అందరిలో కనిపిస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. 2014లో కేసీఆర్ తుమ్మిళ్ల ప్రాజెక్టు ఇస్తానని మాట ఇవ్వడంతోపాటు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే ఆర్డీఎస్‌పై కుర్చీ వేసుకొని నీళ్లు పారిస్తానని హామీ ఇచ్చి మరిచిపోయారని దుయ్యబట్టారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న సంపత్‌కుమార్ సింధనూరు వద్ద ఆర్డీఎస్ కాల్వలో కేసీఆర్ కోసం కుర్చీ వేసి దీక్ష చేపట్టినట్లు గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతలు మంజూరు చేసినా పూర్తిస్థాయిలో నిర్మించలేదని, అలంపూర్‌కు వంద పడకల ఆస్పత్రి నిర్మించి ప్రారంభిస్తే డాక్టర్లు, సిబ్బంది లేక అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని విమర్శించారు. నడిగడ్డలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే మంచి సంకల్పంతో సంపత్‌కుమార్ కొట్లాడుతున్నారని, ఆయన ఓటేసి అండగా ఉండాలని కోరారు.

- '2009లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంపత్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ బీఫాం ఇచ్చిందన్నారు. పీజీ చేసుకున్న ఒక దళిత బిడ్డ అసెంబ్లీలోకి రావాలని వైఎస్ నా మిత్రుడు సంపత్‌కు టికెట్ ఇచ్చారన్నారు. కానీ, చల్లా వెంకట్రామిరెడ్డి వైఎస్ వద్ద పట్టుబట్టి టికెట్ అబ్రహంకు ఇప్పించాడన్నారు. నామినేషన్ వేసిన సంపత్‌కుమార్ తనకు బీఫాం ఇచ్చి వెనక్కి తీసుకుంటే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా పార్టీ కోసం కట్టుబడి పనిచేశారన్నారు. ఆ రోజు సంపత్ వద్దని అబ్రహంను తెచ్చావ్. ఈ రోజు అబ్రహం వద్దని ఇంకొకరిని తీసుకొస్తున్నావ్.. ఏంది నీ కుట్ర అని చల్లానుద్దేశించి ప్రశ్నించారు. ఎందు కోసం పార్టీ మారావని, ఆ మాత్రం ఎమ్మెల్సీ పదవీ కాంగ్రెస్ పార్టీ ఇవ్వకుండేనా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ మీ తాతను రాష్ట్రపతిని చేసింది.. మీ తండ్రిని ఈ ప్రాంత ప్రజలు భుజాలపై మోశారన్నారు. కాంగ్రెస్ చల్లా వెంకట్రామిరెడ్డికి ఏం తక్కువ చేసిందని దుయ్యబట్టారు.



ఆ బాధ్యత నాది..

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే బాధ్యత తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గద్వాలలో బోయలకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిద్దామంటే ఎవరూ రాకపోవడం వల్లే సరితను అడిగి టికెట్ ఇచ్చినట్లు చెప్పారు. ఆడబిడ్డకు ఇచ్చినం కాబట్టి గెలిపిస్తే బోయలకు ఎమ్మెల్సీ ఇస్తామన్నారు. అలాగే ఎస్టీ జాబితాలో చేర్పించే బాధ్యత నేను తీసుకుంటానన్నారు. నేను నల్లమల్లలో పుట్టినా.. మీ బిడ్డను నేను మీలో ఒకడిని అన్నారు. సోనియాగాంధీ మనకు ఒక అవకాశం ఇచ్చిందని.. వడ్డించే వారు మనోడైతే బంతిలో ఒక బుక్క ఎక్కువ తినవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడి సరితను గెలిపించాలని కోరారు. గద్వాలలో ఎలాంటి అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమని.. గద్వాల బస్టాండ్ చౌరస్తాలో నేను, సరిత వస్తాం మీరు చర్చకు వస్తారా అని సవాల్ విసిరారు. నడిగడ్డలో జూరాల, నెట్టెంపాడు ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన పాదయాత్ర ద్వారా రైతుల కన్నీళ్లు చూసి జలయజ్ఞం ద్వారా ఉమ్మడి జిల్లాలో నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ప్రాజెక్టులు నిర్మించారని, ఈ ప్రాజెక్టులు కట్టినందుకు కష్టాలు వచ్చాయా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో 90 శాతం పూర్తయిన ప్రాజెక్టులను పదేళ్లలో కేసీఆర్ పూర్తిచేయలేకపోయారని ఎద్దేవా చేశారు. తుమ్మిళ్ల మొదలుకుని పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలను కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సరిత మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన మీ ఆడబిడ్డను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే గద్వాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని చెప్పారు.

నిండు మనస్సుతో ఆశీర్వదించండి..

వేలాది మంది రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు నిండు మనస్సుతో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించడానికి వచ్చిన అందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని రేవంత్‌రెడ్డి అన్నారు. మా సీతక్క, ప్రశాంత్‌రెడ్డి, మల్లురవి, జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, జిల్లా పార్టీ నాయకులు సభ విజయవంతానికి కృషి చేసిన అందరికీ అభినందనలు తెలియజేస్తున్నా అన్నారు. కొత్తకోట దయాకర్‌రెడ్డి తనకు పెద్దన్న అని.. ఆ కుటుంబం కూడా పెద్ద మనసు చేసుకొని శ్రీహరిని గెలిపించేందుకు ముందుకు వచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు ప్రశాంతరెడ్డి టికెట్ ఆశించి కూడా శ్రీహరి గెలుపుకోసం పనిచేయడానికి ముందుకు వచ్చారని కొనియాడారు. వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే 24 గంటలుఉచిత విద్యుత్ అందిస్తామన్నారు.



బహిరంగ సభకు హాజరైన ప్రజలు

నోటా.. వాటా

ఏటేటా పెరుగుతున్న అభ్యర్థుల తిరస్కరణ ఓటు

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో దీని ప్రభావం ఎక్కువే..
- 2014లో 14,663 ఓట్లు.. 2018లో 25,340 ఓట్లు పోలు
- కొన్నిచోట్ల అభ్యర్థులకు నోటా కంటే తక్కువగా నమోదు
- అభ్యర్థులను భయపెడుతున్న నన్ ఆఫ్ ది అబో

అచ్చంపేట: నోటా.. ఈ పదం ఎక్కువగా ఎన్నికల సమయంలో వినపడుతూ ఉంటుంది. ఈవీఎం మిషన్లపై చివరగా ఉండే ఈ నోటా గురించి నిరక్షరాసులకు తెలియకపోవచ్చేమో కానీ.. అక్షరాస్యులకు మాత్రం దాదాపుగా అందరికీ గుర్తుంటుంది. అయితే ఈ గుర్తు ఎవరికీ సంబంధించినది కాకపోయినా.. ఎన్నికల కమిషన్ ఓటు వేయడంలో దీనికి చోటు కల్పించింది. పార్టీలకు సంబంధించి నచ్చని అభ్యర్థులు చాలామంది ఓటు వేయకుండా మిన్నంకుండిపోతున్నారు. ఇలాంటి వారు సైతం ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు తమకు ఏ పార్టీ అభ్యర్థి నచ్చలేదు అని చెప్పడానికి వీలవుతుంది. ఈ క్రమంలో ఈవీఎంలపై ఉన్న నోటా బటన్‌ను నొక్కవచ్చు. దీనిని ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికల్లో నోటా బటన్ నొక్కే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది.

సుప్రీంకోర్టు సూచనతో..


2014 సార్వత్రిక ఎన్నికల్లో నోటాను ఎన్నికల సంఘం అమల్లోకి తీసుకొచ్చింది. అభ్యర్థులెవరూ నచ్చకపోతే తిరస్కరించే అవకాశం ఓటరుకు ఉండాలని పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా విభాగాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్న తరుణంలో.. నోటాను అందుబాటులోకి తీసుకురావాలని ఎన్నికల సంఘం 2009లో తొలిసారిగా సుప్రీంకోర్టుకు చెప్పింది. ప్రభుత్వం దీనిని వ్యతిరేకించినప్పటికీ పలు సంస్థలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. దీంతో నోటాను అమల్లోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు 2013 సెప్టెంబర్ 27న తీర్పు వెలువరించింది.

ప్రజాప్రాతినిధ్య చట్టంలో..

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నచ్చకుంటే తిరస్కరణ ఓటు వేసే హక్కును భారత రాజ్యాంగం ఎప్పుడో కల్పించింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 49(ఓ) కింద ఓటర్లు ఈ హక్కును వినియోగించుకునే వీలుంది. పోలింగ్ బూత్‌లోని ప్రిసైడింగ్ అధికారి వద్ద దీని కోసం 17–ఏ ఫారం తీసుకుని ఫలానా అభ్యర్థిని తిరస్కరిస్తున్నానని చెబుతూ సంతకం లేదా వేలిముద్ర వేసి బ్యాలెట్ పెట్టెలో వేయవచ్చు. అయితే రహస్య బ్యాలెట్ విధానానికి ఇది విరుద్ధమని, ఓటరు భద్రత దృష్ట్యా ఇది సరైనది కాదని వ్యతిరేకత ఉండేది. ఈ నేపథ్యంలోనే ఈవీఎంలు అందుబాటులోకి రావడంతో ఎన్నికల సంఘం నోటాను అమలు చేసింది.

నోటా అంటే?

నోటా (నన్ ఆఫ్ ది అబో) అంటే.. పైన నిలబడిన వ్యక్తుల్లో ఎవరూ కాదు' అని అర్థం. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులలో ఎవరూ నచ్చలేదని చెప్పేందుకు ఎన్నికల సంఘం దీనిని తీసుకొచ్చింది. పోలింగ్ శాతం పెంచడంతో పాటు ఓటర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే అవకాశం కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చాలా మంది నోటాను ఎంచుకున్నారు. నోటా ప్రభావం ఉమ్మడి జిల్లాలో ఎక్కువగానే ఉంది. ఎన్నికలు జరిగిన ప్రతీసారి నోటాకు పడుతున్న ఓట్ల సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. ఎంతలా అంటే.. పలుచోట్ల అభ్యర్థుల తలరాతను మార్చేంతలా ఉంది. గెలిచిన అభ్యర్థికి వచ్చిన ఆధిక్యం కంటే నోటాకు పోలైన ఓట్లే ఎక్కువ. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో మూడు వేలకు పైగానే ఓట్లు పడ్డాయంటే అర్థం చేసుకోవచ్చు.



పద్ధతి

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నోటాకు పోలైన ఓట్లు..

నియోజకవర్గం	2014	2018
నాగర్‌కర్నూల్	1,041	923
వనపర్తి	860	2,014
మహబూబ్‌నగర్	618	1,423
గద్వాల	862	1,315
నారాయణపేట	1,131	1,946
అచ్చంపేట	1,298	2,403
కల్వకుర్తి	1,140	1,356
కొల్లాపూర్	767	1,182
అలంపూర్	1,490	3,490
జడ్చర్ల	1,537	1,117
కొడంగల్	1,136	1,472
మక్తల్	724	2,101
దేవరకద్ర	1,213	2,689
షాద్‌నగర్	846	1,909

పెరుగుతున్న ఆదరణ..

2014 ఎన్నికల నుంచి నోటాకు ఆదరణ పెరుగుతూ వస్తోంది. బరిలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఓటర్లు నోటా బటన్ నొక్కేస్తున్నారు. 2014లో తొలిసారిగా నోటాను బ్యాలెట్ షీట్‌లో చేర్చారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నోటాకు 14,663 ఓట్లు పోలైతే.. 2018లో 25,340 ఓట్లు పోలయ్యాయి. 2014, 2018 ఎన్నికల్లో కొందరు అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు రావడం విశేషం. కొన్ని నియోజకవర్గాల్లో స్వతంత్ర, జాతీయ పార్టీల అభ్యర్థుల కంటే నోటాకే ఎక్కువ ఓట్లు పోలైన పరిస్థితి కనిపిస్తోంది. 2014లో కల్వకుర్తిలో గెలుపొందిన వంశీచంద్‌రెడ్డి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో విజేతకు 78 ఓట్ల మెజార్టీ రాగా.. నోటాకు 1,140 ఓట్లు వచ్చాయి. ఇదే నియోజకవర్గంలో 2018లో జైపాల్‌యాదవ్‌కు 3,777 ఓట్ల మెజార్టీ రాగా.. నోటాకు 1,356 ఓట్లు పోలయ్యాయి.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

కోస్గి: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని.. దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర గనులశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జాంద్ర సంఘం కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో మాయమాటలు చెబుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోందన్నారు. రూ.కోట్లతో నియోజకవర్గంలో గతంలో ఎప్పుడు జరగని అభివృద్ధిని చేసిన నరేందర్‌రెడ్డి కావాలో.. హైదరాబాద్‌కే పరిమితమయ్యే రేవంత్‌రెడ్డి కావాలో ప్రజలు నిర్ణయించుకొని ఓటు వేయాలని సూచించారు. అనంతరం పార్టీలో చేరిన డీకే రాములుతో పాటు ఇతర టీడీపీ నాయకులకు గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

రేపు మంత్రి కేటీఆర్ రాక..

గురువారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్న సందర్భంగా రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ వస్తున్నారని.. ఈ సందర్భంగా నిర్వహించే రోడ్‌షోకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, ఈజీఎస్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, పార్టీ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, ప్రధానకార్యదర్శి వెంకటనర్సింహులు, నాయకులు గందె ఓంప్రకాష్, కోడిగంటి హరి, కౌన్సిలర్లు జనార్దన్‌రెడ్డి, బాలేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

ఎస్సెస్సీ పరీక్ష ఫీజులు చెల్లించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ ఏడాది మార్చిలో జరగనున్న ఎస్‌ఎస్‌సీ పరీక్ష ఫీజులను చెల్లించాలని డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు సబ్జెక్టుల లోపు ఉంటే రూ.110, అంతకు మంచి ఎక్కువగా ఉంటే రూ.125 లను చెల్లించాలని సూచించారు. ఈనెల 17లోగా ఫీజు చెల్లించాలని, రూ.50 లేట్ ఫీజుతో వచ్చే నెల 1 లోగా చెల్లించే విధంగా పాఠశాల యాజమాన్యాలు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అబ్రహం కాదు.. విజయుడికే..

- సిట్టింగ్‌ను కాదనుకొని.. ఎమ్మెల్సీ అనుచరుడికి బీఫాం
- పంతం నెగ్గించుకున్న చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: బీఆర్‌ఎస్ సిట్టింగ్ అభ్యర్థికి గులాబీబాస్ షాకిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21న సిట్టింగ్ ఎమ్మెల్యేలను అభ్యర్థులుగా ప్రకటించారు. అందులో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి.. తన అనుచరుడికి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. మారిన రాజకీయ పరిణామాలతో అబ్రహంకు బీఫాం ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడంతో అనిశ్చితికి దారితీసింది. ఎట్టకేలకు ఎమ్మెల్సీ తన పంతాన్ని నెగ్గించుకోవడంతో 20 రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. ఎమ్మెల్యే అబ్రహంను కాదనుకొని ఎమ్మెల్సీ అనుచరుడు విజయుడికి బీఫాం దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా విజయుడు బీఫాం అందుకున్నారు.



రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న విజయుడు



నెల్లూరు కోడెలొచ్చాయ్..

మరికల్: ప్రతి ఏటా దీపావళికి నెల్లూరుకు చెందిన కొందరు వ్యాపారులు మండలంలోని మాధవరం గ్రామానికి వందల సంఖ్యలో నెల్లూరు కోడెలను తీసుకొచ్చి ఇక్కడి రైతులకు విక్రయిస్తారు. ఒక్కో జత రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటుంది. కొనుగోలు చేసిన రైతులు వాయిదాల పద్ధతిలో ప్రతి సంక్రాంతికి కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. రైతులు తమ ఆర్థిక స్తోమత ఆధారంగా అయిదు, పది కంతుల్లో మొత్తం డబ్బులు చెల్లిస్తారు. కోడెల కొనుగోలుకు రైతులు ఎంతో ఆసక్తి కనబరుస్తారని గ్రామస్తులు చెబుతున్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ

- నారాయణపేటలో నిల్

నారాయణపేట: నారాయణపేటలో నాలుగోరోజు మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి రాంచందర్ తెలిపారు.

మక్తల్‌లో ఒకటి..

మక్తల్: మక్తల్ నియోజకవర్గంలో మంగళవారం ఒక నామినేషన్ దాఖలైంది. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మ్యాకలి దశరథ్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మయాంక్ మిత్తల్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు ఒక నామినేషన్ మాత్రమే వచ్చినట్లు ఆర్‌ఓ వివరించారు.

మహబూబ్‌నగర్‌లో ఏడు..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/జడ్చర్ల/దేవరకద్ర: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా మున్నూరు రవి నామినేషన్ వేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అనిల్‌కుమార్ తెలిపారు. జడ్చర్లలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్‌దాస్ నామినేషన్ దాఖలు చేశారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో కలిసి తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ మోహన్‌రావుకు అందజేశారు. అదేవిధంగా ఆర్‌సీపీఐ అభ్యర్థిగా నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం బలాన్‌పల్లికి చెందిన వెల్జాల బస్వయ్య, స్వతంత్ర అభ్యర్థిగా జడ్చర్ల మండలం మర్రిచెట్టు తండాకు చెందిన ముడావత్ శంకర్, బీఎంపీ అభ్యర్థిగా ఉమ్మడి ఆనంద్ నామినేషన్లను దాఖలు చేశారు. దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరు నామినేషన్లు వేశారు. చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన బీజేపీ ఎంపీటీసీ బోయ రాము స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. భూత్పూర్ మండలానికి చెందిన జంగయ్య ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు ఆర్‌ఓ నాగరాజు తెలిపారు



మక్తల్‌లో నామినేషన్ వేస్తున్న మ్యాకలి దశరథ్

మక్తల్.. స్థానికులకు దూరం

- చిట్టెం కుటుంబీకులకే పట్టం
- మొదటి ఎమ్మెల్యే శాంతాబాయి
- ఇద్దరికి మంత్రివర్గంలో చోటు
- డిప్యూటీ స్పీకర్‌గా చిట్టెం నర్సిరెడ్డికి అవకాశం



మక్తల్: నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలే అధికం. ఇక్కడి రాజకీయాలు కూడా విలక్షణంగా ఉంటాయి. ప్రజలు పార్టీలను కాకుండా అభ్యర్థులను చూసి తీర్పునిస్తుంటారు. స్థానికేతరులే ఇక్కడ ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ వచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఒకటుంటే ఇక్కడ ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉండటం విశేషం. ఎక్కువగా చిట్టెం కుటుంబీకులకే ఇక్కడి ఓటర్లు పట్టం కట్టారు. నియోజకవర్గం నుంచి ఎల్లారెడ్డి, కల్యాణి రాంచందర్‌రావు మార్కెటింగ్‌శాఖ మంత్రులుగా, చిట్టెం నర్సిరెడ్డి డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

1952లో నియోజకవర్గ ఏర్పాటు..


మక్తల్ నియోజకవర్గం 1952లో ఏర్పడింది. అప్పట్లో మక్తల్, మాగనూర్, ఊట్కూర్, నారాయణపేట, ధన్వాడ, మద్దూర్, దామరగిద్ద మండలాలు ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో మక్తల్, మాగనూర్, కృష్ణా, ఊట్కూరు మండలాలతో పాటుగా అమరచింత, ఆత్మకూర్, నర్వ, మదనాపురం మండలాల్లోని పలు గ్రామాలు సెగ్మెంట్‌లోకి వచ్చాయి. నియోజకవర్గంలోని కొన్ని మండలాలు నారాయణపేట జిల్లాలో ఉండగా, మరికొన్ని మండలాలు వనపర్తి జిల్లా పరిధిలో ఉన్నాయి. 1952 నుంచి 2018 వరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. 1952లో నిర్వహించిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో శాంతాబాయి ఎన్నికయ్యారు.


ఓటర్ల వివరాలు:

పురుషులు:	మహిళలు:
1,17,576	1,21,009
మొత్తం: 2,38,586	

కులాల వారీగా..

బీసీలు:	ఎస్సీలు:	ఎస్టీలు:
80,000	36,200	25,000
మైనార్టీలు: 30,000	రెడ్డిలు: 18,000	





1957 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బసప్ప, ఇండిపెండెంట్‌గా బన్నప్ప పోటీ చేయగా.. బన్నప్పకు 21,152, బసప్పకు 17,314 ఓట్లు వచ్చాయి. 3,838 ఓట్ల మెజార్టీతో ఇండిపెండెంట్ అభ్యర్థి బన్నప్ప గెలుపొందారు.

1962లో కాంగ్రెస్ నుంచి కల్యాణి రాంచందర్‌రావు, ఇండిపెండెంట్‌గా బాగోజీ అంబదాస్‌రావు పోటీ చేయగా.. కాంగ్రెస్ అభ్యర్థికి 23,816, అంబదాస్‌రావుకు 10,321 ఓట్లు వచ్చాయి. 13,495 ఓట్ల మెజార్టీతో కల్యాణ్ రాంచందర్‌రావు విజయం సాధించారు.

1967 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కల్యాణి రాంచందర్‌రావుకు 23,130 ఓట్లు రాగా, సమీప ఇండిపెండెంట్ అభ్యర్థి ఎస్.రావుకు 21,093 ఓట్లు వచ్చాయి. 2,037 ఓట్ల మెజార్టీతో రాంచందర్‌రావు గెలుపొందారు.

1972 ఎన్నికల్లో కల్యాణి రాంచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

1978 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నర్సింహులు, జనతాపార్టీ నుంచి చిట్టెం నర్సిరెడ్డి పోటీ చేయగా.. కాంగ్రెస్ అభ్యర్థి 29,627 ఓట్లు సాధించి విజయం సాధించారు.

1983లో కాంగ్రెస్ తరఫున నర్సింహులునాయుడు, జేఎస్‌పీ నుంచి ఎల్లారెడ్డి పోటీపడగా, నర్సింహులునాయుడు 6,240 ఓట్లతో గెలుపొందారు.

1985 మధ్యంతర ఎన్నికల్లో జనతాదళ్ పార్టీ తరఫున పోటీ చేసిన చిట్టెం నర్సిరెడ్డి 45,606 ఓట్లు సాధించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నర్సింహులునాయుడు (35,704)పై గెలుపొందారు.

1989లోనూ చిట్టెం నర్సిరెడ్డి జనతాదళ్ నుంచి పోటీచేసి 44,256 ఓట్లతో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థి నర్సింహులునాయుడు (35,704)పై విజయం సాధించారు.

1994లో టీడీపీ అభ్యర్థిగా ఊట్కూరుకు చెందిన ఎల్లారెడ్డి పోటీ చేయగా 41,063 ఓట్లు వచ్చాయి. బీజేపీ నుంచి పోటీచేసిన నాగూరావు నామాజీకి 23,585 ఓట్లు రాగా, 17,448 ఓట్ల మెజార్టీతో ఎల్లారెడ్డి గెలుపొందారు.

1999లో టీడీపీ నుంచి పోటీచేసిన ఎల్లారెడ్డి రెండోసారి విజయం సాధించడంతో రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి పదవి లభించింది.

2004 ఎన్నికల్లో చిట్టెం నర్సిరెడ్డి 55,375 ఓట్లతో గెలుపొందారు. అప్పుడు మిత్రపక్షాల అభ్యర్థి నాగూరావు నామాజీకి 53,019 ఓట్లు వచ్చాయి. నాగూరావు నామాజీ కేవలం 2,356 ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

2005 ఆగస్టు 15న నారాయణపేటలో జరిగిన నక్సలైట్ల కాల్పుల్లో చిట్టెం నర్సిరెడ్డి మరణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో అతడి తనయుడు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి 64,878 ఓట్లు రాగా.. ఇండిపెండెంట్ అభ్యర్థి సూగప్పకు 24,799 ఓట్లు వచ్చాయి. 40,679 ఓట్ల మెజార్టీతో చిట్టెం గెలుపొందారు.

2009లో టీడీపీ నుంచి దయాకర్‌రెడ్డి పోటీచేయగా 53,261 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి 47,560 ఓట్లు వచ్చాయి. దయాకర్‌రెడ్డి 5,701 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీఆర్ఎస్ నుంచి ఎల్లారెడ్డి పోటీ చేశారు. రామ్మోహన్‌రెడ్డికి 51,632 ఓట్లు.. ఎల్లారెడ్డికి 41,605 ఓట్లు వచ్చాయి. 10,027 ఓట్ల మెజార్టీతో చిట్టెం విజయం సాధించారు.

2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పోటీ చేయగా 78,686, ఇండిపెండెంట్ అభ్యర్థి జలంధర్‌రెడ్డికి 30,247 ఓట్లు వచ్చాయి. 48,315 ఓట్ల మెజార్టీతో చిట్టెం గెలుపొందారు.


కల్యాణి రాంచందర్‌రావు


నర్సింహులు నాయుడు


చిట్టెం నర్సిరెడ్డి


ఎల్కోటి ఎల్లారెడ్డి

గద్వాల, కొడంగల్ బీజేపీ అభ్యర్థులు వీరే..

గద్వాల నియోజకవర్గం



పేరు: బలిగెర శివారెడ్డి అలియాస్ బోయ శివ
భార్య: పటేల్ జానకమ్మ
తల్లిదండ్రులు: గోవిందమ్మ, రామన్‌గౌడ
పిల్లలు: రాజేంద్రప్రసాద్, మోహన్‌ప్రసాద్, డాక్టర్ బాలకృష్ణ
సామాజిక వర్గం: వాల్మీకి (బోయ)
పుట్టిన తేదీ: 18-06-1960
స్వస్థలం: బలిగెర, గట్టు మండలం
రాజకీయ నేపథ్యం: 1978నుంచి 1983 వరకు బలిగెర గ్రామ పటేల్‌గా పనిచేశారు. 1978లో మాజీ ఎమ్మెల్యే డీకే సత్యారెడ్డి అనుచరుడిగా ఉన్నారు. 1988లో బలిగెర గ్రామ సర్పంచ్‌గా, 2001లో ఎంపీటీసీగా పనిచేశారు. 1994లో డీకే భరత్‌సింహారెడ్డి అనుచరుడిగా ఉండి ఆయన గెలుపునకు కృషి చేశారు. 1999లో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేశారు. 2014లో డీకే అరుణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ గట్టు మండలం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కొడంగల్ నియోజకవర్గం

పేరు: బంటు రమేష్ ముదిరాజ్
భార్య: సౌజన్య, ఇద్దరు సంతానం
తల్లిదండ్రులు: అంజమ్మ, లాలప్ప
పుట్టిన తేదీ: 15-01-1980
స్వస్థలం: కోస్గి
విద్యార్హత: ఎంఎస్సీ, ఎంసీజే, ఎల్‌ఎల్‌బీ
వృత్తి: విద్యాసంస్థల నిర్వాహణ, రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్స్



రాజకీయ నేపథ్యం: ఏబీవీపీ మండల అధ్యక్షుడిగా, కొడంగల్ భాగ్ ప్రముఖ్‌గా, వికారాబాద్ ఏబీవీపీ నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ఖమ్మం జిల్లా సంఘటన కార్యదర్శిగా, అస్సాం రాష్ట్ర సంఘటన కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. సాందీపని పత్రికకు 6 సంవత్సరాలు ఎడిటర్‌గా పని చేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, బీజేపీ రాష్ట్ర ట్రెనింగ్ సెల్ కోకన్వీనర్‌గా పని చేశారు. ప్రస్తుతం దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు.

అలంపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు

అలంపూర్: బీఆర్ఎస్ అభ్యర్థిగా విజేయుడిని ఖరారు చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ అధినేత కేసీఆర్ విజేయుడి పేరును ప్రకటించారు.

ప్రొఫైల్..
పేరు: కోడెదూడ విజయుడు (కె.విజయ్)
తల్లిదండ్రులు: సవారమ్మ, సవారన్న
భార్య: అనిలా
పిల్లలు: హర్షవర్ధన్, గణేష్
పుట్టిన తేదీ: 10-06-1977
స్వస్థలం: పుల్లూరు, ఉండవెల్లి మండలం
రాజకీయ నేపథ్యం: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అనుచరుడిగా గుర్తింపు



డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి

గోవా సీఎం ప్రమోద్ సావంత్

జడ్చర్ల: డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని గోవా సీఎం ప్రమోద్ సావంత్ అన్నారు. మంగళవారం జడ్చర్ల అసెంబ్లీ స్థానానికి బీజేపీ తరఫున మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం స్థానిక నేతాజీ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో గోవా సీఎం మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. బీజేపీతోనే నవతెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. జాతీయ రహదారుల అభివృద్ధి, ఇంటింటికీ తాగునీళ్లు, కరెంట్, ఆరోగ్య కార్డులను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ పేరుతో సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటేనని.. వీరంతా ఒక పార్టీలోకి ఒకరు వెళ్తారని తెలిపారు. 9ఏళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ కమీషన్ల కోసం కక్కుర్తి పడిందని విమర్శించారు. రైతుల భూములను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారు ఆక్రమించుకున్నారని, దేవాదాయశాఖ భూములను సైతం వదలలేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టి బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, మాజీ సర్పంచ్ సీతారాం పాల్గొన్నారు.



జడ్చర్లలో మాట్లాడుతున్న గోవా సీఎం ప్రమోద్

ఓట్లు రాకుంటే డిపాజిట్ గల్లంతే..

ఎన్నికల్లో డిపాజిట్ దక్కితేనే గౌరవప్రద ఓటమి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): 'మీకు డిపాజిట్ కూడా రాదు'.. ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థులపై ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తరచూ చేసే వ్యాఖ్యలివి. ఫలితాలు వెలువడిన అనంతరం ఓడిన అభ్యర్థులకు తమ డిపాజిట్ డబ్బులు తిరిగి వస్తే అది గౌరవప్రదమైన ఓటమిగా భావిస్తారు. ఆ డబ్బులు తిరిగి రాకపోతే అభ్యర్థి చిత్తుగా ఓడిపోయినట్లే. ప్రస్తుతం నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో అసలు డిపాజిట్ అంటే ఏమిటి? అభ్యర్థులు డబ్బులను రిటర్నింగ్ అధికారి వద్ద ఎందుకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది? అనే ఆసక్తికర అంశాలను తెలుసుకుందాం.

నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థుల వ్యక్తిగత వివరాల పరిశీలన, ధ్రువీకరణ, ఈవీఎంలపై గుర్తుల కేటాయింపు, సర్వీస్ ఓటర్లకు బ్యాలెట్ పేపర్లపై గుర్తులను ముద్రించడం వంటి ప్రతి అంశంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంటుంది. అభ్యర్థి ప్రచార ఖర్చులు, కదలికలపై ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక బృందాలు నిశిత పరిశీలన చేస్తాయి. అభ్యర్థులు ఏదో తమాషాకు పోటీ చేస్తే ఎన్నికల సంఘానికి అనవసర ఖర్చు పెరగడంతో పాటు అధికారుల విలువైన సమయం వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్ని కల సంఘం పోటీచేసే అభ్యర్థుల నుంచి షరతులతో కూడిన సెక్యూరిటీ డిపాజిట్లను స్వీకరిస్తుంది.

ఆర్‌ఓ వద్ద..

ఎన్నికల సంఘం శాసనసభ ఎన్నికలకు సంబంధించి రూ.10వేలు డిపాజిట్‌ను నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మాత్రం అందులో సగం (రూ.5వేలు) చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) వద్ద ఈ మొత్తాన్ని డిపాజిట్ చేస్తారు. ఆ మొత్తాన్ని ట్రెజరీశాఖలో తెరిచిన ప్రత్యేక ఖాతాలో ఆర్‌ఓ జమ చేస్తారు.

ఆరోవంతు ఓట్లు సాధిస్తేనే..

నియోజకవర్గంలో పోలైన మొత్తం ఓట్లలో ఆరోవంతు ఓట్లను అభ్యర్థి సాధించాల్సి ఉంటుంది. అంటే 16 శాతానికిపైగా ఓట్లు వస్తేనే అభ్యర్థికి ఫలితాలు వెలువడిన అనంతరం రిటర్నింగ్ అధికారి డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. లేనిపక్షంలో ఆ డబ్బులను ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకుంటుంది.

ఆ నేతకు చేటుతెచ్చింది.. మాటలేనా?



వనపర్తి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఓ అసెంబ్లీ సెగ్మెంట్ ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందింది. ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత యవ్వారం చర్చనీయాంశంగా మారింది. తన మాటలే..తనకు చేటు తెచ్చిపెట్టాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేతికి చిక్కినట్టే చిక్కిన ఎమ్మెల్యే టికెట్ చేజారిపోవడం స్వకృతాపరాధమేనని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ అధ్యక్షత పదవి గురించి చేసిన వ్యాఖ్యలతో పార్టీలో ఒక్కసారిగా ప్రోత్సాహం కరువై ఓటమిపాలయ్యారు. మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఢిల్లీ స్థాయిలో పోరాడి టికెట్ తెచ్చుకుని పోరుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఇటీవల నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గతంలో తప్పిపోయిన సీఎం కుర్చీ ఈసారి అదృష్టం ఉంటే దక్కొచ్చని వ్యాఖ్యలు చేయడం బెడిసికొట్టింది. రాష్ట్ర పార్టీ పెద్దలు కొందరు పోటీలోనే లేకుండా చేశారనే చర్చ కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌తో పాటు ఇతర పార్టీల్లోని మేధావి వర్గం చర్చించుకుంటున్నారు. దీనిపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటం గమనార్హం.

నగదు సీజ్



వనపర్తి: జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4.96 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి తెలిపారు. వీపనగండ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.3.97లక్షలు, పెద్దమందడి మండలం వెల్టూరు చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.99వేల నగదు పట్టుబడినట్లు తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.4లక్షల నగదును పట్టుకున్నట్లు స్టాటిక్ సర్వేలెన్ టీం ఇన్‌చార్జ్ పరమేష్‌గౌడు, ఎక్సైజ్ సీఐ ఖలీద్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం భగల్‌కోట నుంచి తరలిస్తున్న నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు వారు వెల్లడించారు.

అఫిడవిట్ సమర్పించని వారికి నోటీసులు

వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్


వీసీలో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లతో పాటు అఫిడవిట్ సమర్పించని వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలో 15కు మించి నామినేషన్లు వస్తే అదనపు బీయూలు ఏర్పాటు చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈనెల 18న ఈవీఎం రెండవ విడత ర్యాండమైజేషన్‌కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించిన అనుమతులు మాత్రమే ఇస్తామని, తక్కినవి జిల్లా స్థాయిలో ఇవ్వాలని స్పష్టం చేశారు. సీ-విజిల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలని, సీ-విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫారం-6, 7ల దరఖాస్తులను పరిష్కరించాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల ఫారాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డుల డౌన్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి సారించి రోజు నివేదిక సమర్పించాలన్నారు. వారం, 10రోజుల్లో కొత్త ఓటరు గుర్తింపుకార్డులు ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెబ్ కాస్టింగ్ విషయమై ఎఫ్‌ఎస్‌టీ, వాహనాలతో పాటు పోలింగ్ కేంద్రాల బయట, లోపల ఏర్పాటుపై శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి బుధవారంలోగా 12-డీ ఇవ్వాలని తెలిపారు. వీసీలో కలెక్టర్ జి.రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్, డీసీఓ సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, జిల్లా మైనార్టీ సంక్షేమాభివృద్ధి శాఖ అధికారి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి రవీంద్రనాథ్ ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ అన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయనున్న జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలను మంగళవారం ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూంలు, ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లు, మీడియా కేంద్రం తదితర అంశాలపై చర్చించారు. అంతేగాక అధికారులు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ఇతరుల వాహనాల పార్కింగ్, 100 మీటర్ల పరిధిలో తీసుకోవాల్సిన చర్యలు ఇతర విషయాలపై రిటర్నింగ్ అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జడ్చర్ల రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, మహబూబ్‌నగర్ ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి అనిల్ కుమార్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు, ఈఈ నరేందర్‌రెడ్డి, డీటీ రాజ్‌గోపాల్, ఆర్‌ఐలు చైతన్య, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల సిత్రాలు



మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఓ దివ్యాంగుడికి శిరస్సు వంచి నమస్కరించి ఓటును అభ్యర్థించారు. - జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)



నాగర్‌కర్నూల్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తాడూరులో ఓవైపు సెంట్రింగ్ పనిచేస్తూ.. మరోవైపు ప్రచారం నిర్వహించారు. - తాడూరు


చాయ్ పెట్టు.. ఓటు పట్టు..
నారాయణపేట మండలం బైరంకొండలో బీజేపీ అభ్యర్థి రతంగ పాండురెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం చేసిన గోవా ఎమ్మెల్యే కృష్ణ సల్కార్.. ఓ టీకొట్టులో స్వయంగా గిరక తిప్పుతూ టీ తయారు చేశారు. - నారాయణపేట రూరల్


గిరిజన వస్త్రధారణతో..
నారాయణపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి గిరిజన వస్త్రధారణతో ప్రచారం నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది. - నారాయణపేట

సాక్షి
బిజినెస్
బుధవారం
8-11-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▼	నిఫ్టీ ▼
16	5
64,942	19,407

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	13,615	▲	93
డోజోన్స్‌	34,141	▲	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,410	▼	8
డాక్స్‌	15,153	▲	17
షాంఘై	3,057	▼	1
నికాయ్‌	32,708	▼	448

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,579	▼	474
బంగారం (99.5 స్వచ్ఛత)	60,336	▼	472
వెండి (కేజీ)	72,705	▼	1,332

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	99.99	103.36
€	యూరో	ఎస్‌బీఐ	87.01	90.10
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	54.58	56.26
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	52.53	54.84
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	60.20	62.14
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.65	23.49
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.29	12.38

వుయ్‌వర్క్‌ దివాలా!

- వ్యాపార పునర్‌వ్యవస్థీకరణపై దృష్టి
- లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు



న్యూయార్క్‌: ఆఫీస్‌ స్పేస్‌ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అంతర్జాతీయ దిగ్గజం వుయ్‌వర్క్‌ దివాలా ప్రకటించింది. వ్యాపారాన్ని యథా ప్రకారం కొనసాగిస్తూ, కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించుకునే దిశగా అమెరికాలో చాప్టర్‌ 11 దివాలా పిటిషన్‌ దాఖలు చేసింది. వ్యాపార పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కమర్షియల్‌ ఆఫీస్‌ లీజుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధీకరించుకోనున్నట్లు పేర్కొంది. రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకునే దిశగా పునర్‌వ్యవస్థీకరణ విషయంలో తోడ్పాటు అందించేలా సంబంధిత వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అమెరికా, కెనడా వెలుపలి దేశాల్లోని తమ కార్యకలాపాలపై ఈ పరిణామ ప్రభావం ఉండబోదని వుయ్‌వర్క్‌ వివరించింది. సమస్యలను పరిష్కరించుకుని, వ్యాపారాన్ని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో డేవిడ్‌ టోలీ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఈ ఏడాది ప్రథమార్ధంలో 696 మిలియన్‌ డాలర్ల నష్టం నమోదు చేసింది. జూన్‌ 30 నాటికి వుయ్‌వర్క్‌కు 39 దేశాల్లో 777 చోట్ల కార్యకలాపాలు ఉన్నాయి.

అప్పట్లో 50 బిలియన్‌ డాలర్ల వేల్యుయేషన్‌ ..

గతంలో దాదాపు 50 బిలియన్‌ డాలర్ల వేల్యుయేషన్‌తో వెలుగొందిన వుయ్‌వర్క్‌ దివాలా తీయడానికి అనేక కారణాలు ఉన్నాయి. అతి దూకుడుగా విస్తరించడం, వ్యవస్థాపకుడు ఆడమ్‌ న్యూమాన్‌ పోకడలు మొదలైనవి ఇందుకు దారితీశాయి. వాస్తవానికి కొన్నాళ్ల క్రితం నుంచే దివాలా సంకేతాలు కనిపించడం మొదలైంది. 2019లో తొలి పబ్లిక్‌ ఇష్యూ ప్రయత్నం ఘోరంగా విఫలం కాగా ఆ తర్వాత 2021లో ఐపీవోకి వచ్చినా వేల్యుయేషన్‌ అనేక రెట్లు తగ్గి 9 బిలియన్‌ డాలర్లకు పడిపోయింది. అంతకన్నా ముందే కంపెనీ, వ్యవస్థాపకుడి పనితీరుపై ఇన్వెస్టర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో.. న్యూమాన్‌ ఉద్వాసనకు గురయ్యారు. సంస్థలో మెజారిటీ వాటాలు తీసుకున్న జపాన్‌ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌.. కంపెనీని నిలబెట్టేందుకు ప్రయత్నించింది. నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం, ఆదాయాన్ని పెంచుకోవడం వంటి ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం లేకపోయింది. వ్యాపారాన్ని కొనసాగించే సామర్థ్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయంటూ వుయ్‌వర్క్‌ ఆగస్టులోనే వెల్లడించింది. ఆ తర్వాత లీజులన్నింటినీ పునఃసమీక్షించుకునే యోచనలో ఉన్నట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. నష్టాల్లో ఉన్న లొకేషన్ల నుంచి వైదొలగనున్నట్లు తెలిపింది.

భారత్‌లో ప్రభావం ఉండదు..

వుయ్‌వర్క్‌ గ్లోబల్‌ దివాలా ప్రభావం భారత విభాగంపై ఉండదని వుయ్‌వర్క్‌ ఇండియా సీఈవో కరణ్‌ విర్వాణి స్పష్టం చేశారు. దివాలా ప్రక్రియలో భారత వ్యాపారం భాగంగా లేదని తెలిపారు. వుయ్‌వర్క్‌ ఇండియాలో రియల్‌ ఎస్టేట్‌ సంస్థ ఎంబసీ గ్రూప్‌నకు 73 శాతం, వుయ్‌వర్క్‌ గ్లోబల్‌కు 27 శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌లో ఏడు నగరాల్లో వుయ్‌వర్క్‌ ఇండియాకు 50 కేంద్రాలు ఉన్నాయి. 2021 జూన్‌లో వుయ్‌వర్క్‌ ఇండియాలో వుయ్‌వర్క్‌ గ్లోబల్‌ 100 మిలియన్‌ డాలర్లు ఇన్వెస్ట్‌ చేసింది.

స్వల్పంగా పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ రుణ రేటు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ కొన్ని కాలపరిమితుల రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా 0.05 శాతం (ఐదు బేసిస్‌ పాయింట్లు) పెంచింది. రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గడచిన ఐదు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లోనూ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5%) పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ తాజా రేటు పెంపు నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఓవర్‌నైట్‌ ఎంసీఎల్‌ఆర్‌ 8.65 శాతానికి పెరిగింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్‌ 9.30 శాతానికి ఎగసింది. కాగా, సాధారణంగా అధిక రుణాలకు ప్రాతిపదిక అయిన ఏడాది రుణ రేటు మాత్రం 9.20 శాతం వద్ద స్థిరంగా ఉంది.

హైదరాబాద్‌లో రిలయన్స్‌ స్వదేశ్‌



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: రిటైల్‌ రంగ దిగ్గజం రిలయన్స్‌ రిటైల్‌ 'స్వదేశ్‌' తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్‌ జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రిలయన్స్‌ ఫౌండేషన్‌ ఫౌండర్, చైర్‌పర్సన్‌ నీతా అంబానీ చేతుల మీదుగా నేడు (బుధవారం) ఈ స్టోర్‌ ప్రారంభం కానుంది. సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఫర్నిచర్, బొమ్మలు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, పెయింటింగ్స్, యాక్సెసరీస్‌తోపాటు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. దేశవ్యాప్తంగా చేతి వృత్తుల కళాకారులకు చెందిన గుర్తింపు ఉన్న సంఘాల నుంచి నేరుగా వీటిని సేకరిస్తారు. రూ.6 లక్షలకుపైగా ధర పలికే వస్తువులనూ విక్రయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

08-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్‌ ధర (డజను)	72.00
07-11-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	515-00
వరంగల్‌	517-00
రిటైల్‌ ధర	5.75

పవర్‌ గ్రిడ్‌ లాభం అప్‌

క్యూ2లో రూ. 3,781 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్‌ గ్రిడ్‌ కార్ప్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్‌(క్యూ2)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 3,781 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,349 కోట్ల నుంచి రూ. 11,530 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డిసెంబర్‌ 6కల్లా చెల్లించనుంది.

ఫలితాల నేపథ్యంలో పవర్‌ గ్రిడ్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 208 వద్ద ముగిసింది.

జోయాలుక్కాస్‌ దీపావళి క్యాష్‌బ్యాక్‌ ఆఫర్లు



హైదరాబాద్‌: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్‌ క్యాష్‌బ్యాక్‌ ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 విలువైన డైమండ్, అన్‌ కట్‌ డైమండ్స్‌-ప్రెషస్‌ జ్యువెలరీ కొనుగోలుపై రూ.2 వేల విలువైన క్యాష్‌బ్యాక్‌ గిఫ్ట్‌ వోచర్‌ పొందవచ్చు. అలాగే రూ.50 వేల విలువైన బంగారం ఆభరణాల కొనుగోలుపై రూ.1000 విలువైన క్యాష్‌బ్యాక్‌ గిఫ్ట్‌ వోచర్, రూ.10వేల విలువైన వెండి ఆభరణాలపై రూ.500 విలువైన గిఫ్ట్‌ వోచర్లు అందిస్తుంది. అడ్వాన్స్‌ బుకింగ్‌ స్కీమ్‌తో షాపింగ్‌ చేసే కస్టమర్లు ప్రోత్సాహక బహుమతి పొందొచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఆఫర్లు నవంబర్‌ 12 వరకు అమలులో ఉంటాయి. క్యాష్‌బ్యాక్‌ రూపంలో కస్టమర్లకు మేమిచ్చే బహుమతులు వారి దీపావళిని మరింత శోభాయమానం చేస్తాయని సంస్థ ఎండీ జాయ్‌ అలుక్కాస్‌ తెలిపారు.

3 రోజుల లాభాలకు బ్రేక్‌

- స్వల్ప నష్టాల ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడంతో స్టాక్‌ సూచీల 3 రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్‌ పడింది. ఆసియా, యూరప్‌ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ సందర్భంగా ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్‌లో 383 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్‌ చివరికి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 64,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టంతో 19,407 వద్ద నిలిచింది. చైనా అక్టోబర్‌ ఎగుమతులు భారీగా క్షీణించినట్లు డేటా వెల్లడికావడంతో ఆసియాలో ఒక్క తైవాన్‌ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్‌ సూచీలు 2% నష్టపోయాయి. కార్పొరేట్‌ క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన, ఇంధన షేర్ల పతనంతో యూరప్‌ మార్కెట్లు ఒకశాతం మేర పతనమయ్యాయి.

- హోనాసా కన్జూమర్‌ లిస్టింగ్‌ పర్వాలేదనిపించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.324) వద్దే లిస్టయ్యింది. చివరికి 4% లాభంతో రూ.337 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్‌ విలువ రూ.10,848 కోట్లుగా నమోదైంది.
- ఈఎస్‌ఏఎఫ్‌ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్‌ ఐపీఓ చివరిరోజు నాటికి 73.15 రెట్లు సబ్‌స్క్రయిబ్‌ అయ్యింది. 5.77 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 422 కోట్ల ఈక్విటీలకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 173.52 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటా 84.37 రెట్లు, రిటైల్‌ ఇన్వెస్టర్ల కోటా 16.97 రెట్లు సబ్‌స్క్రయిబ్‌ అయ్యాయి.

బ్యాంకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఫిన్‌టెక్‌

'ఆర్‌బీఐ' నివేదిక



ముంబై: సమీప భవిష్యత్తులో సాంప్రదాయ బ్యాంకింగ్‌కు ఫిన్‌టెక్‌ రంగం ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సెంటర్‌ ఫర్‌ అడ్వాన్స్‌డ్‌ ఫైనాన్షియల్‌ రీసెర్చ్‌ అండ్‌ లెర్నింగ్‌ (కెఫ్రాల్‌) ఒక నివేదికలో పేర్కొంది. డిజిటలీకరణ వృద్ధికి, ఆర్థిక స్థిరత్వ సాధనకు ఎప్పటికప్పుడు తగు విధంగా మల్చుకోగలిగే నియంత్రణ విధానాలు అవసరమని తెలిపింది. ఇండియా ఫైనాన్స్‌ రిపోర్ట్‌ 2023 పేరిట కెఫ్రాల్‌ రూపొందించిన తొలి ప్రచురణను రిజర్వ్‌ బ్యాంక్‌ గవర్నర్‌ శక్తికాంత దాస్‌ మంగళవారం విడుదల చేశారు. బ్యాంకింగ్, ఫైనాన్స్‌ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 2011లో కెఫ్రాల్‌ను లాభాపేక్ష రహిత సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. దేశీయంగా బ్యాంకిగేతర ఆర్థిక రంగ స్థితిగతులను అర్థం చేసుకోవడంలో నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు సహా సంబంధిత వర్గాలకు సహాయకరంగా ఉండే అంశాలను తాజా నివేదికలో పొందుపర్చారు. దేశీ సాంకేతిక తోడ్పాటుతో భారత్‌లో డిజిటలీకరణ వేగవంతమవుతోందని, డిజిటల్‌ రుణాలు.. ముఖ్యంగా ఫిన్‌టెక్‌ రుణాలు గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది.

మ్యాక్సివిజన్‌ బ్రాండ్‌ అంబాసిడర్‌గా ధోని



చెన్నై: కంటి సంరక్షణ సేవల సంస్థ మ్యాక్సివిజన్‌సూపర్‌ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్‌ తాజాగా క్రికెటర్‌ మహేంద్ర సింగ్‌ ధోనిని తమ బ్రాండ్‌ అంబాసిడర్‌గా నియమించుకుంది. అన్ని వర్గాలకు చిరపరిచితమైన ధోని వంటి దిగ్గజంతో జత కట్టడమనేది.. క్రమం తప్పకుండా కంటి చెకప్‌లు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి దోహదపడగలదని సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. చౌకగా కంటి సంరక్షణ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. తమ నెట్‌వర్క్‌లోని 40కిపైగా ఆస్పత్రుల్లో నిత్యం వేల కొద్దీ పేషెంట్లకు సర్వీసులు అందిస్తున్నామని సంస్థ సీఈవో సుధీర్‌ వీఎస్‌ తెలిపారు.

భవిత

జాబ్‌ పాయింట్‌

ఎన్‌ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో యంగ్‌ ప్రొఫెషనల్‌ పోస్టులు

హైదరాబాద్‌ రాజేంద్రనగర్‌లోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ పంచాయతీరాజ్‌.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్‌ ప్రొఫెషనల్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎంబీఏ(హెచ్‌ఆర్‌) చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.32,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 12.11.2023
» **వెబ్‌సైట్‌:** www.nirdpr.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 10 ఆఫీసర్‌ ట్రైనీ(లా) పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్‌ గ్రిడ్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌(పీజీసీఐఎల్‌).. క్లాట్‌ 2024 స్కోరు ద్వారా ఆఫీసర్‌ ట్రైనీ(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **అర్హత:** 60 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ లేదా ఇంటిగ్రేటెడ్‌ లా/ఎల్‌ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణతతోపాటు క్లాట్‌-2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 29.11.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** క్లాట్‌-2024 స్కోర్, గ్రూప్‌ డిస్కషన్, పర్సనల్‌ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 09.11.2023.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 29.11.2023
» **వెబ్‌సైట్‌:** www.powergrid.in

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 13 ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** జిల్లా కోఆర్డినేటర్‌-1, జిల్లా ప్రాజెక్ట్‌ అసిస్టెంట్‌-1, బ్లాక్‌ కోఆర్డినేటర్‌-11.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» **వేతనం:** నెలకు జిల్లా కోఆర్డినేటర్‌కు రూ.30,000. జిల్లా ప్రాజెక్ట్‌ అసిస్టెంట్‌కు రూ. 18,000. బ్లాక్‌ కోఆర్డినేటర్‌కు రూ.20,000
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బాలసదన్‌ పక్కన, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్‌:** allurisitharamaraju.ap.gov.in

బెల్‌ బెంగళూరులో 16 ప్రాజెక్ట్‌ ఇంజనీర్‌ పోస్టులు

బెంగళూరులోని భారత్‌ ఎలక్ట్రానిక్స్‌ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్‌.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్‌ ఇంజనీర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **అర్హత:** బీఈ, బీటెక్‌(ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ /ఎలక్ట్రానిక్స్‌ /టెలికమ్యూనికేషన్‌/కమ్యూనికేషన్‌/ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ టెలికమ్యూనికేషన్‌/ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ ఇంజనీరింగ్‌ /ఎలక్ట్రికల్‌ ఇంజనీరింగ్‌/ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్‌స్ట్రుమెంటేషన్‌/ఇన్‌స్ట్రుమెంటేషన్‌).
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2023
» **వెబ్‌సైట్‌:** www.belindia.in

నంద్యాల జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో 23 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
» **పోస్టుల వివరాలు:** జిల్లా చైల్డ్‌ ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌-01, ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌ ఇన్‌స్టిట్యూషనల్‌ కేర్‌-01, ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌ నాన్‌ ఇన్‌స్టిట్యూషనల్‌ కేర్‌-01, లీగల్‌ కమ్‌ ప్రొటెక్షన్‌ ఆఫీసర్‌-01, కౌన్సిలర్‌-01, సోషల్‌ వర్కర్‌-02, అకౌంటెంట్‌-01, డేటా అనలిస్ట్‌-01, అసిస్టెంట్‌ కమ్‌ డేటాఎంట్రీ ఆపరేటర్‌-01, అవుట్‌రీచ్‌ వర్కర్స్‌-02, మేనేజర్‌/కోఆర్డినేటర్‌(మహిళలు)-01, సోషల్‌ వర్కర్‌ కమ్‌-ఎర్లీ చైల్డ్‌హుడ్‌ ఎడ్యుకేటర్‌(మహిళలు)-01, నర్సు(మహిళలు)-01, డాక్టర్‌(పార్ట్‌టైమ్‌)-01, ఆయా(మహిళలు)-06, చౌకీదార్‌(మహిళలు)-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంటర్,డిగ్రీ,పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బీఎస్‌ఎన్‌ఎల్‌ క్వార్టర్స్, బొమ్మలసత్రం, నంద్యాల చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్‌:** nandyal.ap.gov.in

ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌.. సంక్షిప్తంగా ఐఐఎం! మేనేజ్‌మెంట్‌ విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులకు నిత్యనూతన నైపుణ్యాలు అందించడంలో.. ముందుండే ఇన్‌స్టిట్యూట్స్‌!! వీటిలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్‌ సంస్థల రెడ్‌ కార్పెట్‌ స్వాగతం ఖాయం అనే అభిప్రాయం! ఐఐఎంల్లో ఇటీవల సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ప్రక్రియ మొదలైంది! పలు సంస్థలు భారీ స్టయిఫండ్‌తో ఎస్‌పీఓలు ఖరారు చేస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫర్స్‌ తాజా ట్రెండ్స్, అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, స్టయిఫెండ్స్‌ తదితర వివరాలు..

ఐఐఎంల్లో.. సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ హవా!

» ఐఐఎంలలో మొదలైన ఎస్‌పీఓ ప్రక్రియ
» పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో వందశాతం ఆఫర్లు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్‌

కార్పొరేట్‌ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్‌ కేక్స్‌ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయా కంపెనీలకు అవసరమైన నిర్వహణ నైపుణ్యాలు ఐఐఎంల విద్యార్థుల్లో ఉంటాయని భావించడమే ఇందుకు నిదర్శనం. తాజాగా ఐఐఎంలలో కొనసాగుతున్న ఎస్‌పీఓ ప్రక్రియ, అందిస్తున్న ఆఫర్లే ఇందుకు నిదర్శనం అంటున్నారు నిపుణులు.

సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌గా

ఐఐఎం పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తయ్యాక లభించే సెలవు రోజుల్లో సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ చేస్తారు. అంతకు ముందు కంపెనీలు విద్యార్థులను ఇంటర్న్‌ ట్రైనీగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌లో నెగ్గిన విద్యార్థులకు సంస్థలు రెండు వారాల వ్యవధిలో ఇంటర్న్‌ ట్రైనీగా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఇంటర్న్‌ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్‌ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాయి. ఇది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది.

అందరికీ ఆఫర్స్‌

- 2023-25 బ్యాచ్‌ విద్యార్థులకు సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫర్స్‌ వెల్లువెత్తున్నాయి.
- ఐఐఎం-లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫర్స్‌ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్‌ నెలకు రూ 1.31 లక్షలుగా, గరిష్ఠ స్టయిఫండ్‌ రూ.3.5 లక్షలుగా నిలవడం గమనార్హం.
- ఐఐఎం-కోల్‌కతలో.. 466 మంది విద్యార్థులకుగాను అందరికీ సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ లభించడం విశేషం. వీరికి సగటు స్టయిఫండ్‌ రూ.1.65 లక్షలుగా, గరిష్ఠ స్టయిఫండ్‌ రూ.3.75 లక్షలుగా ఉంది.
- ఐఐఎం-నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ లభించాయి. సగటు స్టయిఫండ్‌ రూ.79 వేలుగా ఉంది.

కొనసాగుతున్న ప్రక్రియ

దేశంలోని ఇతర ఐఐఎంలలోనూ ప్రస్తుతం సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫర్స్‌ ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐఎం-అహ్మదాబాద్, బెంగళూరు తదితర క్యాంపస్‌లలో ఈ నెల రెండో వారంలోపు ఈ ప్రక్రియ పూర్తవనుంది. ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం-ఇతర ఐఐఎంలలోనూ సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ దాదాపు వంద శాతం లభించే సంకేతాలున్నాయని ఆయా క్యాంపస్‌ ప్లేస్‌మెంట్‌ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎఫ్‌ఎస్‌ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్‌

- ఐఐఎంలు, ఇతర బి-స్కూల్స్‌లో సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఏడాది కన్సల్టింగ్, ఫైనాన్స్‌ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు అన్ని బి-స్కూల్స్‌లో దాదాపు 40 శాతం మేర సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌.. కన్సల్టింగ్, ఫైనాన్స్‌ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్‌ అండ్‌ కో, యాక్సెంచర్‌ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్‌ కంపెనీలు టాప్‌ రిక్రూటర్స్‌గా నిలిచాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్‌ రంగాల తర్వాత ఐటీ, ఈ-కామర్స్‌ సంస్థలు టాప్‌ రిక్రూటర్స్‌గా ఉన్నాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్‌ విభాగాల్లో ఇంటర్న్‌షిప్‌ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్‌ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్‌ మార్కెటింగ్‌లోనూ

సేల్స్‌ అండ్‌ మార్కెటింగ్‌ ప్రొఫైల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్‌ రీసెర్చ్, మార్కెట్‌ అనాలిసిస్‌ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్‌ లభించాయి. అదే సమయంలో జనరల్‌ మేనేజ్‌మెంట్‌ విభాగంలోనూ సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫర్స్‌ ఖరారయ్యాయి. పలు సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్‌ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్‌ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.



ఎంబీఏ స్పెషల్‌

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ఆఫర్స్‌లో ఎక్కువగా డేటా మేనేజ్‌మెంట్; ఫైనాన్స్‌ మేనేజ్‌మెంట్; జనరల్‌ అడ్మినిస్ట్రేషన్; సేల్స్‌ అండ్‌ మార్కెటింగ్; డేటా అనలిటిక్స్; బిజినెస్‌ స్ట్రాటజీస్‌ ప్రొఫైల్స్‌ ముందంజలో ఉంటున్నాయి.

ఎందుకంత క్రేజ్‌

సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ పేరిట కంపెనీలు ఐఐఎంల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ ఆఫర్స్, రూ.లక్షల్లో స్టయిపండ్‌ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు రియల్‌ టైమ్‌ నైపుణ్యాలు, అప్‌డేటెడ్‌ నాలెడ్జ్‌ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. విద్యార్థులను కార్పొరేట్‌ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా కరిక్యులం ఉంటుంది. అందుకే ఈ ఇన్‌స్టిట్యూట్స్‌ నుంచి ఇంటర్న్‌ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి కొలువుకు మార్గం

సమ్మర్‌ ప్లేస్‌మెంట్స్‌ ట్రైనింగ్‌ సమయంలో విద్యార్థులు చూపే పనితీరు ఆయా సంస్థల్లో పూర్తి స్థాయి కొలువుకు మార్గంగా నిలుస్తుంది. ఎస్‌పీఓ దక్కించుకున్న అభ్యర్థులు ట్రైనీగా ప్రతిభ చూపితే.. అదే సంస్థలో శాశ్వత నియామకం సొంతం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్న్‌షిప్‌ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించిన వారికి కంపెనీలు ముందుగానే ఆఫర్స్‌ ఖరారు చేస్తున్నాయి. ఇలాంటి అభ్యర్థులకు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్‌ ప్లేస్‌మెంట్స్‌ ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఫైనల్‌ ఆఫర్‌ లభిస్తుంది.

ఫైనల్‌ ప్లేస్‌మెంట్స్‌

ప్రస్తుతం సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్‌ ప్లేస్‌మెంట్‌ ప్రక్రియ కూడా ఆశాజనకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల వ్యాపారాలు పుంజుకుంటున్నాయని, అవి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని క్యాంపస్‌ ప్లేస్‌మెంట్‌ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకు అవసరమైన స్కిల్స్‌ ఉన్న వారిని నియమించుకునేందుకు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయని చెబుతున్నారు.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి-స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్‌ ప్లేస్‌మెంట్‌ డ్రైవ్స్‌ ఆశాజనకంగా ఉండనున్నాయి. అలాగే మరో ప్రముఖ బీస్కూల్‌ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ-జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్‌ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్‌ కూడా గరిష్ఠంగా రూ.3.5 లక్షలుగా నమోదవడం విశేషం. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ విభాగంలోనూ ఎంబీఏ విద్యార్థులకు బెస్ట్‌ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు.